PRGI Reg No. TGTEL/25/A0555
https://www.youtube.com/@PrabhathaSuryuduNews
https://www.facebook.com/prabhathasuryudu

# ప్రభాత సూర్యుడు

నిజం దాగదు.. వార్త ఆగదు
జాతీయ తెలుగు దినపత్రిక
www.prabhathasuryudu.com

తెలంగాణ | సంపుటి : 01 | సంచిక :160 | పేజీలు : 8 | వెల రూ.5 | శుక్రవారం. 26.06.2026

ఎడిటర్ : చెరుకు ఉపేందర్
Published From Rangareddy
Circulated by All Districts of Telangana and Andhra Pradesh




## అట్టహాసంగా తుంగభద్ర కొత్త కస్ట్ గేట్ల ప్రారంభం

# చేతులు కలిపి ఐక్యత చాటిన సీఎంలు



హోస్పేట్, ప్రభాత సూర్యుడు కర్ణాటకలోని హోస్పేట్ వద్ద ఉన్న తుంగభద్ర డ్యామ్ 33 కొత్త క్రస్ట్ గేట్ల ప్రారంభోత్సవం అట్టహాసంగా జరిగింది. ఈ కార్యక్రమానికి తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, ఆంధ్రప్రదేశ్ సీఎం చంద్రబాబు, కర్ణాటక సీఎం డీకే శివకుమార్‌తో పాటు కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్ హాజరయ్యారు. ముందుగా వారంతా హోస్పేట్‌లోని ఐఆర్‌బీ గెస్ట్‌హౌస్‌లో మర్యాదపూర్వకంగా సమావేశమయ్యారు. అనంతరం తుంగభద్ర డ్యామ్ సైట్‌కు వెళ్లి ముగ్గురు ముఖ్యమంత్రులతో సహా కేంద్ర మంత్రి వరుసగా 17, 18, 19, 20వ క్రస్ట్ గేట్లను ప్రారంభించారు. ఆ తర్వాత అక్కడే జ్ఞాపికగా శిలాఫలాకాన్ని సైతం ఆవిష్కరించారు. చివరగా సీఎం డీకే శివకుమార్, రేవంత్ రెడ్డి, చంద్రబాబు, కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్ చేతులు కలిపి ప్రజలకు అభివాదం చేసి గ్రూప్ ఫొటో దిగారు.

**మేము చరిత్ర సృష్టిస్తాం: డీకే శివకుమార్**

కర్ణాటకలోని హోస్పేటలో తుంగభద్ర ప్రాజెక్టు కొత్త గేట్లను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సీఎం డీకే శివకుమార్ కీలక వ్యాఖ్యలు చేశారు. కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్ నాయకత్వంలో ముగ్గురు సీఎంలు చంద్రబాబు, రేవంత్ రెడ్డి, తాను చరిత్ర సృష్టించామన్నారు. తాము చరిత్ర చదవమని, చరిత్ర లిఖించము అని కానీ చరిత్ర సృష్టిస్తామని చెప్పారు. దక్షిణ భారతదేశాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో భాగమైనందుకు తనకు చాలా సంతోషంగా ఉందని అన్నారు. జత కూడటం ఆరంభం అని, కలిసి నిర్ణయం తీసుకోవడం ప్రగతి అని, కలిసి పనిచేస్తే విజయం సాధిస్తామని అన్నారు. ఇప్పుడు మూడు రాష్ట్రాల రైతుల కోసం కలిసి చారిత్రక నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. మా నీళ్లు.. మా హక్కు అనే నినాదాన్ని నిజం చేశామని చెప్పారు. 1860లో తుంగభద్ర నదిపై ప్రాజెక్టును కట్టారని అన్నారు. ఆ రోజు ప్రాజెక్టును కడితే ఈరోజు రక్షించామని అన్నారు. కృష్ణా, కావేరి, గోదావరి విషయంలోనూ మనందరం ఏకం కావాలని రైతులను బతికించాలమని చెప్పారు.

**“నీరు ఉంటేనే చరిత్ర.. నీరు ఉంటేనే నాగరికత: చంద్రబాబు**

అంతర్రాష్ట్రాల సహకారానికి సరికొత్త ప్రతీకగా నిలుస్తూ కర్ణాటకలోని తుంగభద్ర జలాశయం 33 నూతన క్రస్ట్ గేట్ల ప్రారంభోత్సవ వేడుక గురువారం మునీరాబాద్ వద్ద అత్యంత వైభవంగా జరిగింది. కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సి.ఆర్. పాటిల్, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, తెలంగాణ సీఎం ఎ. రేవంత్ రెడ్డి, కర్ణాటక ముఖ్యమంత్రి డి.కె. శివకుమార్ ఒకే వేదికపై చేరి చారిత్రాత్మక రీతిలో ఈ నూతన గేట్లను ప్రారంభించారు. గత ఏడాది భారీ వరదల వల్ల డ్యామ్ 19వ నంబర్ గేట్ కొట్టుకుపోయిన ఘటనను సవాల్‌గా తీసుకుని, ఎన్డీఎస్ఏ సిఫార్సుల మేరకు సుమారు రూ. 51 కోట్ల వ్యయంతో కేవలం ఆరు నెలల రికార్డు కాలంలోనే పాత గేట్ల స్థానంలో ఈ 33 సరికొత్త గేట్లను విజయవంతంగా అమర్చారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ.. కీలక వ్యాఖ్యలు చేశారు. మూడు రాష్ట్రాల ఉమ్మడి ప్రయోజనార్థం రికార్డు సమయంలో ఈ ప్రాజెక్టును పూర్తి చేసినందుకు కేంద్రమంత్రితో పాటు కర్ణాటక, తెలంగాణ ప్రభుత్వాలకు ఆయన ప్రత్యేక అభినందనలు తెలిపారు. “నీరు ఉంటేనే చరిత్ర.. నీరు ఉంటేనే నాగరికత. జల వనరుల సంరక్షణ, సరైన నీటి యాజమాన్యం అనేది మనందరి ఉమ్మడి బాధ్యత” అని ఆయన దేశ ప్రజలకు పిలుపునిచ్చారు. 70 ఏళ్లకు పైగా చరిత్ర కలిగిన తుంగభద్ర జలాశయం రాయలసీమను కరువు కోరల నుండి కాపాడుతోందని, ఈ ప్రాజెక్ట్ లేకపోతే అక్కడ కరువు తాండవిస్తుందని గుర్తు చేశారు. నీటి విలువ తెలిసిన వ్యక్తిగా తాను గతంలోనే మొత్తం గేట్లను మార్చాలని కర్ణాటక సీఎం డీకే శివకుమార్‌ను కోరానని, ఆయన కూడా తక్షణమే స్పందించి యుద్ధప్రాతిపదికన పనులు పూర్తి చేయించడం అభినందనీయమన్నారు. ముగ్గురు సీఎంలు, కేంద్రమంత్రి ఒకే వేదికపైకి రావడం సరికొత్త అంతర్రాష్ట్ర సఖ్యతకు సంకేతమని, ఇది మున్ముందు కూడా ఇలాగే కొనసాగుతుందని చంద్రబాబు స్పష్టం చేశారు.

**తెలంగాణకు 10 టీఎంసీల నీరు రావట్లేదు..: రేవంత్ రెడ్డి**

తుంగభద్ర డ్యామ్ క్రస్ట్ గేట్ల పునరుద్ధరణ పనులు దక్షిణ భారతదేశ జలవనరుల చరిత్రలో ఒక అపూర్వ ఘట్టమని, ఈ రోజు చరిత్రలో సువర్ణాక్షరాలతో నిలిచిపోతుందని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. కర్ణాటకలోని మునీరాబాద్‌లో జరిగిన తుంగభద్ర నూతన క్రస్ట్ గేట్ల ప్రారంభోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. తుంగభద్ర డ్యామ్ గేట్ల పునరుద్ధరణ పనులు కేవలం ఓ సాంకేతిక విజయం మాత్రమే కాదని, ఇది తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక మూడు రాష్ట్రాల కరవు జిల్లాల సమస్యల పరిష్కారానికి పడిన బలమైన అడుగు అని పేర్కొన్నారు. రాయలసీమలోని కర్నూలు, అనంతపురం జిల్లాల రైతాంగ కష్టాలు, అలాగే తెలంగాణలోని పాలమూరు వలసల గురించిన బాధలు, అక్కడి పరిస్థితులపై తనకు పూర్తి అవగాహన ఉందన్నారు. రాష్ట్రాల మధ్య నీటి సమస్యలను సకాలంలో పరిష్కరించుకోకపోవడం వల్లే ఎంతో విలువైన జలాలు వృథాగా సముద్రం పాలు అవుతున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

**తెలంగాణకు 10 టీఎంసీల నీరు రావట్లేదు..**

అంతరాష్ట్ర జల వివాదాలపై సీఎం రేవంత్ రెడ్డి అత్యంత కీలకమైన వ్యాఖ్యలు చేశారు. తమకు రాష్ట్రాల మధ్య పంచాయతీలు వద్దని.. కేవలం రైతాంగ శ్రేయస్సు కోసం సమస్యల పరిష్కారమే కావాలన్నారు. మూడు రాష్ట్రాల మధ్య నీటి చర్చలు ఒక కొలిక్కి రావడం శుభపరిణామని పేర్కొన్నారు. కృష్ణా, గోదావరి నదీ జలాల సమస్యలకు సైతం ఈ తుంగభద్ర ఒడ్డున జరిగిన చర్చలు త్వరలోనే ఓ శాశ్వత పరిష్కారాన్ని చూపుతాయని నేను బలంగా నమ్ముతున్నానని తెలిపారు. అనంతరం ఆయన రైతుల హక్కుల గురించి మాట్లాడుతూ.. తుంగభద్ర ప్రాజెక్టు నుంచి తెలంగాణకు చట్టబద్ధంగా దక్కాల్సిన 10 టీఎంసీల నీరు ఇంకా రావడం లేదనే విషయాన్ని సీఎం ఈ వేదికపై ప్రస్తావించారు. రాజోలిబండ డైవర్షన్ స్కీమ్ కింద ఉన్న తెలంగాణ రైతులకు ఖచ్చితంగా న్యాయం జరగాలని తాము ఆశిస్తున్నామని, ఈ విషయంలో పొరుగు రాష్ట్రాలు సహకరించాలని ఆయన కోరారు. వివాదాలను పక్కనబెట్టి పరస్పర సహకారంతో ముందుకెళితేనే మూడు రాష్ట్రాల రైతాంగానికి మేలు జరుగుతుందని రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు.

# మోదీతో అమెజాన్ సీఈవో భేటీ..

## రూ.లక్షల కోట్ల పెట్టుబడులు

ఢిల్లీ, ప్రభాత సూర్యుడు ప్రముఖ ఈ-కామర్స్ దిగ్గజం అమెజాన్.. భారత్‌లో తన వ్యాపార కార్యకలాపాలను భారీగా విస్తరించేందుకు సిద్ధమైంది. ప్రధాని నరేంద్రమోదీతో కంపెనీ సీఈఓ ఆండీ జెస్సీ సమావేశమైన అనంతరం ఈ కీలక ప్రకటన వెలువడింది. 2026 నుంచి 2030 మధ్య కాలంలో దేశంలో ఏకంగా 48 బిలియన్ డాలర్ల (సుమారు రూ.4.53 లక్షల కోట్లు) పెట్టుబడి పెట్టనున్నట్లు అమెజాన్ ప్రకటించింది. ఈ పెట్టుబడులతో భారత మార్కెట్‌పై తమకున్న దీర్ఘకాలిక నిబద్ధతను కంపెనీ మరోసారి స్పష్టంచేసింది. భారత్‌లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), క్లౌడ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌ను విస్తరించడానికి 2030 నాటికి అదనంగా 13 బిలియన్ డాలర్లు పెట్టుబడిగా పెట్టనున్నట్లు ఆండీ జెస్సీ తెలిపారు. దాంతో కేవలం ఏఐ, క్లౌడ్ రంగంలోనే అమెజాన్ మొత్తం పెట్టుబడి 21 బిలియన్ డాలర్లను దాటనుంది. ఈ పెట్టుబడుల ద్వారా ముంబై, హైదరాబాద్‌లలోని అమెజాన్ వెబ్ సర్వీసెస్ (ఏడబ్ల్యూఎస్) డేటా సెంటర్ల సామర్థ్యాన్ని గణనీయంగా పెంచనున్నారు. ఇది స్టార్టప్‌లు, వ్యాపార సంస్థలు, ప్రభుత్వ ఏజెన్సీలకు కస్టమ్ ఏఐ చిప్స్, సురక్షిత క్లౌడ్ టెక్నాలజీలు, డెవలపర్ టూల్స్‌ను అందుబాటులోకి తెస్తుంది. తద్వారా ఆవిష్కరణలను వేగవంతం చేయవచ్చని కంపెనీ పేర్కొన్నది. ఈ సమావేశం అనంతరం ఆండీ జెస్సీ మాట్లాడుతూ.. దశాబ్దం క్రితం భారత్‌లోకి అడుగుపెట్టామని, అప్పటి నుంచి ఈ-కామర్స్, ఏఐ, క్లౌడ్ వ్యాపారాల్లో అద్భుతమైన వృద్ధిని చూస్తున్నామని అన్నారు. ప్రధాని మోదీ దార్శనికత అయిన ‘వికసిత్ భారత్’,



‘ఆత్మనిర్భర్ భారత్’ లక్ష్యాల సాధనకు కట్టుబడి ఉన్నామని చెప్పారు. భారత్ వృద్ధి ప్రస్థానంలో దీర్ఘకాలిక భాగస్వామిగా కొనసాగుతామని స్పష్టంచేశారు. ఈ కొత్త పెట్టుబడులతో కలిపి 2010 నుంచి 2030 వరకు భారత్‌లో అమెజాన్ పెట్టిన మొత్తం పెట్టుబడుల విలువ 88 బిలియన్ డాలర్లకు చేరుకుంటుంది. గత కొన్నేళ్లుగా భారత్‌లో 12 మిలియన్ల చిన్న వ్యాపారాలను డిజిటలైజ్ చేశామని, 20 బిలియన్ డాలర్ల విలువైన ఈ-కామర్స్ ఎగుమతులను సాధ్యం చేశామని, ప్రత్యక్షంగా, పరోక్షంగా 2.8 మిలియన్ల ఉద్యోగాలకు మద్దతు ఇచ్చామని అమెజాన్ కంపెనీ వివరించింది.

# ఫిరాయింపు ఎమ్మెల్యేల కేసు.. మరోసారి హైకోర్టు నోటీసులు

హైదరాబాద్,ప్రభాత సూర్యుడు పార్టీ ఫిరాయింపు ఆరోపణలు ఎదుర్కొంటున్న బీఆర్ఎస్‌కు చెందిన 10 మంది ఎమ్మెల్యేల వ్యవహారంపై తెలంగాణ హైకోర్టులో గురువారం విచారణ జరిగింది. గతంలో ఈ ఎమ్మెల్యేలు పార్టీ మారలేదని స్పీకర్ ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ పలువురు ఎమ్మెల్యేలు దాఖలు చేసిన పిటిషన్లను కోర్టు పరిశీలించింది. విచారణ సందర్భంగా అనర్హత పిటిషన్లపై స్పీకర్ ఇచ్చిన తీర్పు కాపీలను కోర్టుకు సమర్పించాలని హైకోర్టు ఆదేశించింది.

# రైతులెవరూ భయపడొద్దు..

## అందరికీ యూరియా అందిస్తాం: మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

ఖమ్మం, ప్రభాత సూర్యుడుజిల్లాలోని చింతకాని మండలం మత్కేపల్లి క్రాస్ రోడ్డులో ఈనెల 30న జరిగే సీఎం రేవంత్ రెడ్డి బహిరంగ సభా స్థలాన్ని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజాప్రభుత్వంలో అత్యంత ప్రాధాన్యం కలిగిన కార్యక్రమం రైతు భరోసా అని చెప్పుకొచ్చారు. జులై నెలలోనే రైతులకు రైతుభరోసా ఇవ్వాలని నిర్ణయించినట్లు తెలిపారు. రాష్ట్రంలోని రైతులందరికీ కలిపి రైతు భరోసా కింద రూ.9 వేల కోట్లను ముఖ్యమంత్రి విడుదల చేయనున్నారన్నారు. ఈ సభకు రైతు ఆశీర్వాద సభగా రైతులే నామకరణం చేశారని తెలిపారు. భారత దేశంలో అత్యధికంగా పంటలు పండించిన రాష్ట్రం తెలంగాణ అని మంత్రి అన్నారు. వ్యవసాయ రంగంలో పంటమార్పిడి విధానంలో ఆయిల్ ఫాం సాగును ప్రోత్సహిస్తున్నామన్నారు. భవిష్యత్తులో పది వేల ఎకరాలను రైతులు సాగు చేసే విధంగా సహకారం అందజేస్తున్నామని చెప్పారు. దేశంలో తెలంగాణలోనే అత్యధిక ఆయిల్ ఫాం సాగు జరుగుతోందన్నారు. పామాయిల్ ఫ్యాక్టరీల నిర్మాణం శరవేగంగా జరుగుతోందని తెలిపారు. రెండేళ్లలో లక్ష కోట్లు రైతాంగానికి అందజేశామని వెల్లడించారు. తెలంగాణ రాష్ట్రంలో రైతులు పండించిన ప్రతి పంటను కొనుగోలు చేశామని అన్నారు. ఏడాదికి పది వేల కోట్లు నష్టం వచ్చినప్పటికీ కొనుగోలు చేస్తున్నామన్నారు. ఏడు రకాల వరి అందుబాటులో ఉందని రైతాంగానికి తుమ్మల తెలియజేశారు. వాతావరణ పరిస్థితులను బట్టి రైతులు పంటల సాగుపై దృష్టి సారించాలన్నారు. బ్లాక్ మార్కెట్‌లో యూరియా ఉంచుతున్నారని... నిల్వ చేసి అధిక



ధరలకు అమ్మేందుకు చూస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులు ఎవరూ కూడా భయపడవద్దని.. అందరికీ యూరియా అందిస్తామని స్పష్టం చేశారు. యూరియా కోసం ప్రత్యేక యాప్‌ను తీసుకొచ్చామని.. అందులో అన్ని వివరాలు ఉన్నాయన్నారు. యూరియా కోసం తెచ్చిన యాప్ దేశానికే ఆదర్శమని ప్రధాని మోదీ కూడా ప్రశంసించే పరిస్థితి ఉందన్నారు. రైతాంగం పాడి పంటపై దృష్టి సారించాలని మంత్రి సూచించారు. అత్యధికంగా పురుగుల మందులు వాడుతున్నారని ఇక్కడి పంటలను విదేశాలు రిజెక్ట్ చేస్తున్నాయన్నారు.

# జూన్ 27న భద్రాద్రికి మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావు పర్యటనను విజయవంతం చేయాలి

**వెంకటాపురం బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గంప రాంబాబు**




ములుగు జూన్ 25, ప్రభాత సూర్యుడువెంకటాపురం: తెలంగాణ రాష్ట్ర ఉద్యమ నాయకులు, సిద్దిపేట శాసనసభ్యులు, శాసనసభ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ తన్నీరు హరీష్ రావు గారు జూన్ 27 శనివారం భద్రాచలం నియోజకవర్గ పర్యటనకు విచ్చేస్తున్నట్లు వెంకటాపురం బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గంప రాంబాబు ఒక ప్రకటనలో తెలిపారు. భద్రాచలంలోని అక్షయ్ ఫంక్షన్ హాల్లో నిర్వహించబోయే నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశానికి హరీష్ రావు ముఖ్య అతిథిగా హాజరై, పార్టీ శ్రేణులకు దిశా నిర్దేశం చేయనున్నారని ఆయన పేర్కొన్నారు.ఈ సమావేశంలో ముఖ్యంగా నియోజకవర్గంలో ప్రజా సమస్యల గుర్తింపు, పరిష్కార వేదికగా ఉన్న ఎస్ఐఆర్ విధానంపై కార్యకర్తలకు పూర్తిస్థాయి అవగాహన కల్పించనున్నారు. అదేవిధంగా రాబోయే రోజుల్లో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు చేపట్టబోయే నూతన సభ్యత్వ నమోదు కార్యక్రమంపై నాయకులకు, కార్యకర్తలకు దిశా నిర్దేశం చేస్తారు.ఈ సందర్భంగా గంప రాంబాబు మాట్లాడుతూ భద్రాచలం నియోజకవర్గ పార్టీ ఇంచార్జ్ రావులపల్లి రాంప్రసాద్ , గొడవర్తి నరసింహమూర్తి వారి నేతృత్వంలో జరగబోయే ఈ పర్యటనను అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుంటున్నట్లు తెలిపారు. ప్రజా సమస్యలపై పోరాటాన్ని ఉధృతం చేయడానికి, పార్టీ బలోపేతానికి ఈ సమావేశం ఎంతో కీలకమైనదని ఆయన అభివర్ణించారు.వెంకటాపురం మండల వ్యాప్తంగా ఉన్న పార్టీ ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు, ఎస్ఐఆర్ పోలింగ్ బూత్ ఏజెంట్లు, పార్టీ సభ్యత్వ ఏజెంట్లు, అనుబంధ సంఘాల నాయకులు , కార్యకర్తలు అందరూ భారీ సంఖ్యలో తరలివచ్చి, ఈ సమావేశాన్ని విజయవంతం చేయవలసిందిగా కోరారు. ముఖ్యంగా ఎస్ఐఆర్ ,సభ్యత్వ నమోదు బాధ్యతలు కలిగిన ఏజెంట్లు అందరూ తప్పనిసరిగా హాజరుకావాలని ఆయన పిలుపునిచ్చారు...

# అట్టేపల్లి రామప్రభు ఆధ్వర్యంలో ఉచిత మెగా హెల్త్ చెకప్ క్యాంప్..




మియాపూర్,ప్రభాత సూర్యుడు అట్టేపల్లి లక్ష్మీనారాయణ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ అట్టేపల్లి రామప్రభు ఆధ్వర్యంలో ప్రజల ఆరోగ్య సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ఉచిత మెగా మెడికల్ హెల్త్ చెకప్ క్యాంప్ ను మియాపూర్ లోఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమం గురువారం నాగసాయి బాబా దేవాలయం, లక్ష్మీనగర్, మియాపూర్ లో నిర్వహించబడింది. ఈ మెగా హెల్త్ క్యాంప్‌లో ప్రజలకు బ్లడ్ ప్రెషర్, రాండమ్ బ్లడ్ షుగర్, హార్ట్ రేట్, బి ఎం ఐ, బాడీ ఫ్యాట్, మసిల్ మాస్, బోన్ మాస్, మెటబాలిక్ ఏజ్, బాడీ వాటర్, విసెరల్ ఫ్యాట్ తదితర పరీక్షలతో పాటు కంటి మరియు దంత వైద్య పరీక్షలు ఉచితంగా నిర్వహించబడ్డాయి.ఈ కార్యక్రమానికి విజయ డయాగ్నస్టిక్ సెంటర్, సెంటర్ ఫర్ సైట్, క్లోవ్ డెంటల్ సంస్థలు సహకారం అందించాయి. క్యాంప్‌కు స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై ఆరోగ్య పరీక్షలు చేయించుకుని వైద్యుల సూచనలు పొందారు.ఈ సందర్భంగా అట్టేపల్లి రామప్రభు మాట్లాడుతూ, ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసం ఇటువంటి సేవా కార్యక్రమాలను నిరంతరం నిర్వహిస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో అట్టేపల్లి పురుషోత్తం, శ్రీరాములు, పార్నందీ నాగులు, దయాకర్, శ్రీరామ్ , కరుణాకర్ లతో పాటు ఏ ర్ పి టీమ్ సభ్యులు, ట్రస్ట్ సభ్యులు, కాలనీ పెద్దలు, యువత, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# కారేపల్లి సెంటర్లో బస్సు షెల్టర్ నిర్మించాలి డివైఎఫ్ఐ.




సింగరేణి జూన్ 26 ప్రభాత సూర్యుడు నిత్యం మండల సెంటర్ కి వేలాదిమందిగా వచ్చే ప్రయాణికులు,విద్యార్థులు, ప్రజలు తమ అవసరాల నిమిత్తం కారేపల్లి కి వివిధ గ్రామాల నుంచి ప్రయాణిస్తుంటారని అలాంటి వారికి నిలబడుటకు, కూర్చునుటకు ఇబ్బందులు పడుతున్నారని డివైఎఫ్ఐ మండల కార్యదర్శి ఆదర్ల వినయ్ కుమార్ అన్నారు.గురువారం మండల తహసిల్దార్ గారికి భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (ణఖీ×) ఆధ్వర్యంలో వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం వర్షాకాలం వస్తున్నందున బస్టాండ్ సెంటర్ మరియు సినిమా హాల్ సెంటర్ నందు నిలువ నీడ లేకపోవడం వలన ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఈ కారణంగా దుకాణాల ముందు హోటల్స్ ముందు చెట్ల కింద నిలబడవలసిన పరిస్థితి దాపురిస్తున్నదని సినిమా హాల్ సెంటర్ మరియు బస్టాండ్ సెంటర్లో షెల్టర్స్ ఏర్పాటు ఏర్పాటు చేయాలని ఆదేర్ల వినయ్ కుమార్ డిమాండ్ చేశారు.

# నెమలి కాల్వలో ఘనంగా పీర్ల పండుగ ఉత్సవాలు

**– 11 రోజుల పాటు భక్తిశ్రద్ధలతో నిర్వహణ**
**– దశాబ్దాల సంప్రదాయాన్ని కొనసాగిస్తున్న గ్రామస్తులు**



వలిగొండ – ప్రభాత సూర్యుడుయాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల పరిధిలోని నెమలి కాల్వ గ్రామంలో పీర్ల పండుగ ఉత్సవాలు అత్యంత వైభవంగా కొనసాగుతున్నాయి. ప్రతి ఏడాది 11 రోజుల పాటు నిర్వహించే ఈ ఉత్సవాలు గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణాన్ని నెలకొల్పుతున్నాయి.ఉత్సవాలు మొదటి రోజు సందుల (పెట్టెల దింపే) కార్యక్రమంతో ప్రారంభమవుతాయి. అనంతరం వివిధ ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. పదో రోజు రాత్రి సంప్రదాయబద్ధంగా మట్కీల కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. చివరి రోజు మొహర్రం సందర్భంగా సవారీలను ఊరూర వీధుల్లో ఘనంగా ఊరేగించి ఉత్సవాలను ముగిస్తారు. ఈ ఊరేగింపును గ్రామస్తులు, భక్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో తిలకిస్తారు.నెమలి కాల్వ గ్రామంలో పీర్ల పండుగ ఉత్సవాలకు వంగాల రామస్వామి గౌడ్ ఆద్యుడు. ఆయన ప్రారంభించిన ఈ సంప్రదాయాన్ని వారసత్వంగా ఆయన కుమారుడు వంగాల లచ్చయ్య గౌడ్ కొనసాగించగా, ప్రస్తుతం వంగాల రమేష్ గౌడ్ ఆధ్వర్యంలో లాల్‌సాబ్ పీర్ల ఉత్సవాలు ఘనంగా నిర్వహించబడుతున్నాయి. గ్రామంలో ఏర్పాటు చేసే లాల్‌సాబ్ పీర్లు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తూ భక్తులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి.ఈ ఉత్సవాలకు గ్రామస్థులు, ముంబై, హైదరాబాద్‌తో పాటు ఇతర రాష్ట్రాలు, నగరాల్లో స్థిరపడిన గ్రామానికి చెందిన వారు కూడా స్వగ్రామానికి చేరుకుని పాల్గొంటారు. బంధుమిత్రులు, భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై ఉత్సవాల వైభవాన్ని మరింత పెంచుతున్నారు.దశాబ్దాలుగా కొనసాగుతున్న ఈ పీర్ల ఉత్సవాలు గ్రామ ప్రజల ఐక్యత, భక్తి, మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తూ ప్రత్యేక గుర్తింపు పొందుతున్నాయి. ప్రతి సంవత్సరం మరింత వైభవంగా నిర్వహించబడుతున్న ఈ ఉత్సవాలు నెమలి కాల్వ గ్రామానికి ప్రత్యేక ఖ్యాతిని తీసుకువస్తున్నాయి.



# మూసీ పరివాహక ప్రాంతాల్లో భూసమీకరణకు పరిశీలన

**– రైతులతో సమావేశమైన అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి**
**– భూసమీకరణ ప్రక్రియపై అవగాహన, సూచనలు**



అబ్దుల్లాపూర్‌మెట్ – ప్రభాత సూర్యుడు:రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండల పరిధిలోని బాచారం, గౌరెల్లి, తిమ్మాయిగూడ, కుత్బుల్లాపూర్, మర్రిపల్లి గ్రామాల్లో మూసీ పరివాహక ప్రాంతాలకు సంబంధించిన భూసమీకరణ (ల్యాండ్ పూలింగ్) ప్రక్రియపై జిల్లా యంత్రాంగం క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టింది. జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కె. చంద్రారెడ్డి ఆయా గ్రామాలను సందర్శించి భూసమీకరణకు ప్రతిపాదిత ప్రాంతాలను పరిశీలించారు. అనంతరం రైతులతో సమావేశమై భూసమీకరణ విధానం, ప్రభుత్వ లక్ష్యాలు, రైతులకు కలిగే ప్రయోజనాలపై వివరించారు. రైతుల అభిప్రాయాలు, సందేహాలను తెలుసుకుని తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. భూసమీకరణ ప్రక్రియలో రైతుల ప్రయోజనాలకు భంగం కలగకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. రైతులు పూర్తి అవగాహనతో నిర్ణయాలు తీసుకోవాలని, ఏవైనా సందేహాలు ఉంటే అధికారులను సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక తహసీల్దార్ బి. సుదర్శన్ రెడ్డి, మండల సర్వేయర్, మండల గిర్దావర్, గ్రామ పాలన అధికారులు, సంబంధిత గ్రామాల రైతులు పాల్గొన్నారు.

# ఇందిరా మహిళా శక్తి చీరల పంపిణీ

**– లబ్ధిదారులకు చీరలు అందజేసిన ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి**
**– ప్రతి పేదింటికి సంక్షేమ ఫలాలు చేరేలా ప్రభుత్వం కృషి**



పెద్ద అంబర్‌పేట్ – ప్రభాత సూర్యుడు:నాగోల్ సర్కిల్ పరిధిలోని పెద్ద అంబర్‌పేట్, కుంట్లూరు డివిజన్‌ల లబ్ధిదారులకు ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరా మహిళా శక్తి చీరల పంపిణీ కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మహిళా లబ్ధిదారులకు చీరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి మాట్లాడుతూ, ప్రతి పేద కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు చేరవేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందేలా ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందన్నారు. మహిళల ఆర్థిక, సామాజిక అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్న ఆయన, ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని అన్నారు. భవిష్యత్తులో కూడా ప్రజలకు మరిన్ని సంక్షేమ పథకాలను అందుబాటులోకి తీసుకురానున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు, మహిళా లబ్ధిదారులు పాల్గొన్నారు.

# అక్రమ నిర్మాణాలపై మౌనం ఎందుకు ?

**– చర్యలు లేకపోవడంతో అధికారుల తీరుపై అనుమానాలు**
**– ఫిర్యాదులు వస్తున్నా పట్టించుకోరా ? అంటూ స్థానికుల ప్రశ్నలు**



పెద్ద అంబర్‌పేట్ – ప్రభాత సూర్యుడు నాగోల్ సర్కిల్ పరిధిలో అక్రమ నిర్మాణాల వ్యవహారం మరోసారి చర్చనీయాంశంగా మారింది. పెద్ద అంబర్‌పేట్ డివిజన్‌లో భారీ స్థాయిలో అక్రమ నిర్మాణ పనులు జరుగుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నప్పటికీ సంబంధిత అధికారులు ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం స్థానికంగా పలు అనుమానాలకు తావిస్తోంది. స్థానికుల కథనం ప్రకారం, పెద్ద అంబర్పేట్ లోని నాగోల్ సర్కిల్ కార్యాలయానికి అతి చేరువలో కళ్లెం బాల్ రెడ్డి ఫంక్షన్ హాల్ ఆవరణంలో భారీ ఎత్తున షెడ్డు నిర్మాణాలకు సంబంధించిన ఫిర్యాదులు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందన కనిపించడం లేదని చెబుతున్నారు. అక్రమ నిర్మాణాలపై నిబంధనల ప్రకారం నోటీసులు జారీ చేయాల్సిన టౌన్ ప్లానింగ్ విభాగం ఎందుకు మౌనం పాటిస్తోందనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.సాధారణ ప్రజలు చిన్నపాటి నిర్మాణాలు చేసినా వెంటనే చర్యలు తీసుకునే అధికారులు, పెద్ద ఎత్తున జరుగుతున్న నిర్మాణాల విషయంలో మాత్రం ఎందుకు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఈ నేపథ్యంలో అధికారుల పనితీరుపై ప్రజల్లో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అక్రమ నిర్మాణాల కారణంగా ప్రభుత్వ ఆదాయానికి నష్టం వాటిల్లే అవకాశం ఉన్నప్పటికీ, సంబంధిత శాఖలు స్పందించకపోవడం గమనార్హమని స్థానిక నాయకులు పేర్కొంటున్నారు. నిబంధనల అమలులో అందరికీ ఒకే విధానం ఉండాలే గానీ, కొందరికి ఒక విధానం, మరికొందరికి మరో విధానం ఉండకూడదని అంటున్నారు. ప్రస్తుతం జరుగుతున్న నిర్మాణాలపై సమగ్ర విచారణ నిర్వహించి, అవసరమైతే నిర్మాణ అనుమతులు, పన్ను రికార్డులు, అసెస్‌మెంట్ వివరాలను పరిశీలించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. అలాగే అక్రమాలు నిర్ధారణ అయితే బాధ్యులపై చర్యలు తీసుకోవడంతో పాటు సంబంధిత అధికారుల పాత్రపై కూడా విచారణ జరపాలని ఉన్నతాధికారుల కోరుతున్నారు.

# కారేపల్లి లో ఎస్ఐఆర్ కార్యక్రమం ప్రారంభం.

**ఓటర్ తమ ఓటు హక్కును సరి చేసుకోగలరు.**
**గ్రామ సర్పంచ్ మేదరి వీర ప్రతాప్.**




సింగరేణి జూన్ 25 ప్రభాత సూర్యుడు కారేపల్లి గ్రామపంచాయతీలో ఎన్నికల సంఘం ఆదేశాల ప్రకారం సర్ ప్రోగ్రాం గురువారం ప్రారంభించారు.ఈ సందర్భంగా అర్హులైన ప్రతి ఓటరికి ఎన్యూమరేషన్ ఫారాలను పంపిణీ చేసి, ఓటరు జాబితాను మరింత పారదర్శకంగా,తప్పులులేకుండా రూపొందించేందుకు చర్యలు చేపట్టారు.ఓటరు జాబితాలో కొత్తగా పేర్ల నమోదు,మార్పులు,సవరణలు,తొలగింపులకు సంబంధించిన దరఖాస్తులను స్వీకరించనున్నట్లు అధికారులు తెలిపారు.ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ మేదరి వీరప్రతాప్ (టోనీ) మాట్లాడుతూ,ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైనదని,గ్రామంలోని ప్రతి అర్హుడు తమ వివరాలను సరిచూసుకుని అవసరమైన సవరణలు చేసుకోవాలని కోరారు.పేరు,చిరునామా లేదా ఇతర వివరాల్లో మార్పులు ఉన్నవారు సంబంధిత ఫారాలను బీఎల్‌వోల ద్వారా సమర్పించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఎమ్మార్వో ఓరుగంటి వెంకటేశ్వర్లు,కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తోటకూరి రాంబాబు, గ్రామపంచాయతీ కార్యదర్శి బి.నెహ్రు,బీఎల్‌వోలు,గ్రామపంచాయతీ పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో ప్రజలందరూ సహకరించాలని అధికారులు విజ్ఞప్తి చేశారు.

# ఇచ్చిన మాట నెరవేర్చాం మంత్రి సీతక్క

**నర్సింహాసాగర్ చర్చి కి సౌండ్ బాక్స్ లను అందించిన జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పైడకుల అశోక్**




ములుగు జూన్ 25, ప్రభాత సూర్యుడుములుగు జిల్లా మంగపేట మండలంలో గురువారం నర్సింహాసాగర్ గ్రామంలో గతంలో ఎన్నికల ప్రచారం సందర్భంగా జిటిఎస్ఎస్ఎస్ చర్చి పాస్టర్ ఊకె లక్ష్మయ్య (లాజర్) చర్చి కి సౌండ్ బాక్స్ లు అవసరం వుంది అక్క అని అడుగగా ఇస్తా అని చెప్పగా సహృదయంతో ఇచ్చిన మాట ప్రకారం గురువారం వాటిని జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పైడకుల అశోక్ వాటిని పాస్టర్ ఊకె లక్ష్మయ్య (లాజర్) కి అందజేశారు ఈ కార్యక్రమంలో జిల్లా ప్రచార కమిటీ చైర్మన్ పూజారి సురేందర్ బాబు, జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షులు ఇస్సార్,మండల వర్కింగ్ కమిటీ అధ్యక్షులు చెట్టుపల్లి వెంకటేశ్వర్లు,గ్రామ కమిటీ అధ్యక్షులు తాతినేని హరికృష్ణ,సీనియర్ నాయకులు తుడి భగవాన్ రెడ్డి, గాదె శ్రవణ్ కుమార్,బోడ సతీష్, తదితరులు పాల్గొన్నారు.

# ఫెర్టిలైజర్ షాపులను తనిఖీ చేసిన ఏడీఏ

**యూరియా కొరత లేదు..**
**రైతులు ఆందోళన చెందొద్దు**

సింగరేణి జూన్ 25 ప్రభాత సూర్యుడుఖమ్మం జిల్లా సింగరేణి మండలంలోని ఎరువుల దుకాణాలు,సొసైటీ ఫెర్టిలైజర్ విక్రయ కేంద్రాలను వైరా ఏడీఏ తుమ్మలపల్లి కరుణశ్రీ గురువారం తనిఖీ చేశారు.కారేపల్లి,సీతారాంపురం,కోమట్లగూడెంలోని సొసైటీ ఫెర్టిలైజర్ సేల్ పాయింట్లతో పాటు గోదాంను పరిశీలించి,యూరియా నిల్వలు,పీవోఎస్(పిఓఎస్) యంత్రం ద్వారా నమోదవుతున్న వివరాలు,ఫెర్టిలైజర్ యాప్‌లో స్టాక్ నమోదును తనిఖీ చేశారు.ఈ సందర్భంగా స్టాక్ వచ్చిన వెంటనే పీవోఎస్ యంత్రంతో పాటు ఫెర్టిలైజర్ యాప్‌లో తప్పనిసరిగా నమోదు చేయాలని సంబంధిత సిబ్బందికి ఆదేశించారు.అనంతరం ఏడీఏ తుమ్మలపల్లి కరుణశ్రీ మాట్లాడుతూ రైతులకు యూరియా కొరత లేకుండా అన్ని సొసైటీ విక్రయ కేంద్రాల్లో తగిన నిల్వలు ఉంచుతున్నామని తెలిపారు.రైతులు వర్షాలు కురిసి భూమిలో తగిన తేమ ఏర్పడిన తర్వాత మాత్రమే విత్తనాలు విత్తాలని సూచించారు.గ్రామాలకు వచ్చి విక్రయించే గుర్తు తెలియని వ్యక్తుల వద్ద విత్తనాలు కొనుగోలు చేసి మోసపోవద్దని హెచ్చరించారు.లైసెన్స్ పొందిన డీలర్ల వద్దనే విత్తనాలు కొనుగోలు చేసి,వాటి రశీదులను పంట చేతికి వచ్చే వరకు భద్రంగా ఉంచుకోవాలని సూచించారు.ఈ తనిఖీల్లో మండల వ్యవసాయ అధికారి బట్టు అశోక్ కుమార్,ఏఈవో నరేష్,సొసైటీ కార్యదర్శి బొల్లు హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.



# ప్రజల వద్దకే సుపరిపాలన సమస్యల పరిష్కారానికి ప్రత్యేక ప్రజా దర్బార్

## మహిళా సంఘాల ఆర్థిక స్వావలంబనకు వడ్డీలేని రుణాలతో ప్రభుత్వ అండ. అర్హులైన ప్రతి పేద కుటుంబానికి పారదర్శకంగా ఇందిరమ్మ ఇండ్ల కేటాయింపు. రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క







ములుగు జూన్ 25, ప్రభాత సూర్యుడు ములుగు జిల్లా మంగపేట మండలం రాజుపేట గ్రామంలోని జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో ఏర్పాటు చేసిన ప్రత్యేక ప్రజా దర్బార్ కార్యక్రమంలో మంత్రి సీతక్క, జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావుతో కలిసి ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. ప్రజల సమస్యలను గ్రామస్థాయిలోనే తెలుసుకొని వేగంగా పరిష్కరించేందుకు ప్రభుత్వం ప్రత్యేక ప్రజా దర్బార్ కార్యక్రమాలను నిర్వహిస్తోందని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క తెలిపారు. ఈ కార్యక్రమంలో మంగపేట మండల పరిధిలోని అక్కినేపల్లి మల్లారం, బ్రాహ్మణపల్లి, రాజుపేట, కత్తిగూడెం, నిమ్మగూడెం, దోమెడ, రామచంద్రునిపేట, వాడేగూడెం, రమణక్కపేట, చుంచుపల్లి, వాగుదుగూడెం గ్రామ పంచాయతీల పరిధిలోని ప్రజలు తమ సమస్యలు, వినతిపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మహిళా సంఘాల ఆర్థిక బలోపేతానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ఇప్పటివరకు మహిళా సంఘాలకు వడ్డీలేని రుణాల రూపంలో రూ.61 వేల కోట్లకు పైగా సహాయం అందించామని తెలిపారు. గతంలో మహిళా సంఘాలకు రూ.5 లక్షల వరకు మాత్రమే అందిన వడ్డీలేని రుణ పరిమితిని ప్రస్తుతం రూ.10 లక్షలకు పెంచామని పేర్కొన్నారు. మహిళా సంఘాల ద్వారా గ్రామీణ ఆర్థిక వ్యవస్థ మరింత బలోపేతం అవుతోందని, పాడి కేంద్రాలు, కొనుగోలు కేంద్రాల నిర్వహణలో మహిళా సంఘాలకు అధిక ప్రాధాన్యత కల్పిస్తున్నామని తెలిపారు. గ్రామీణ మహిళలు సంఘాలుగా ఏర్పడి కలిసి పనిచేస్తే కుటుంబాల ఆర్థికాభివృద్ధి సాధ్యమవుతుందని పేర్కొన్నారు. ప్రజలు జిల్లా కేంద్రాలకు తిరగాల్సిన అవసరం లేకుండా గ్రామాల వద్దకే పరిపాలనను తీసుకువెళ్లడం ప్రత్యేక ప్రజా దర్బార్ లక్ష్యమని మంత్రి తెలిపారు. ప్రజలు అందించే ప్రతి దరఖాస్తును పరిశీలించి, వాటి సాధ్యాసాధ్యాలను అధ్యయనం చేసి నిర్ణీత వ్యవధిలో పరిష్కరించే విధంగా ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తున్నామని తెలిపారు.

ఇందిరమ్మ ఇండ్ల కేటాయింపులో పూర్తి పారదర్శకత పాటిస్తున్నామని, ఇల్లు లేని నిరుపేద కుటుంబాలకు ప్రాధాన్యత క్రమంలో ఇండ్లను అందించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. అర్హులైన ప్రతి పేద కుటుంబానికి న్యాయం జరిగేలా ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటుందని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు మాట్లాడుతూ ప్రజలకు సులభంగా దరఖాస్తులు అందించే విధంగా ప్రత్యేక ఫార్మాట్ రూపొందించామని తెలిపారు. గ్రామాల వారీగా అందుతున్న దరఖాస్తుల ద్వారా స్థానిక సమస్యలపై స్పష్టమైన అవగాహన ఏర్పడి, పరిష్కార చర్యలు మరింత వేగవంతం అవుతాయని తెలిపారు. ప్రతి దరఖాస్తును నమోదు చేసి సంబంధిత శాఖలకు పంపించి, పరిష్కార స్థితిపై నిరంతర పర్యవేక్షణ నిర్వహిస్తామని, సమస్య పరిష్కారం కాకపోతే కారణాలను కూడా ప్రజలకు స్పష్టంగా తెలియజేసే విధంగా వ్యవస్థను రూపొందిస్తున్నామని కలెక్టర్ తెలిపారు. అంతకుముందు మంగపేట మండల కేంద్రంలో పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో ఆఫీస్ భవనాల నిధుల కింద రూ.150 లక్షల వ్యయంతో నిర్మించనున్న మండల ప్రజా పరిషత్ భవన నిర్మాణ పనులకు మంత్రి దనసరి అనసూయ సీతక్క, జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావుతో కలిసి శంకుస్థాపన చేశారు. అనంతరం రాజుపేట గ్రామంలోని జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో నూతనంగా నిర్మించిన సైన్స్ ల్యాబ్ భవనాన్ని మంత్రి దనసరి అనసూయ సీతక్క, జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావుతో కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి లెనిన్ వత్సల్ టోప్పో, ఏటూరు నాగారం ఏ ఎస్ పి మనన్ భట్, అదనపు కలెక్టర్లు సిహెచ్ మహేందర్ జీ., సంపత్ రావు, గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోతు రవిచందర్, మార్కెట్ కమిటీ చైర్పర్సన్ రేగ కళ్యాణి, ఆర్డీవో కృష్ణవేణి, పంచాయతీ రాజ్ డైరెక్టర్ గుమ్మడి సోమయ్య, స్థానిక ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## వెంకట్యతండాలో ఉచిత ఆరోగ్య శిబిరం



సింగరేణి జూన్ 25 ప్రభాత సూర్యుడు. సింగరేణి మండలం వెంకట్యతండాలో గురువారం ది గాడ్ థెరిస్సా మహిళా మండలి,వైఆర్జీకే ఆధ్వర్యంలో ఉచిత ఆరోగ్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా సింగరేణి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ బి.సురేష్,వైద్య సిబ్బంది బిందు,ది గాడ్ థెరిస్సా మహిళా మండలి ప్రాజెక్ట్ మేనేజర్ మైఫా వెంకటేశ్వర్లు,వైఆర్జీకే స్కీమ్ లింక్ వర్కర్ ఆదెర్ల శంకర్ మాట్లాడుతూ హెచ్ఐవీ,ఎయిడ్స్,హెపటైటిస్,క్షయవ్యాధి(టీబీ),లైంగిక వ్యాధులపై ప్రజలకు అవగాహన కలిగి ఉండాలని సూచించారు. అదేవిధంగా బ్రేక్ ఫ్రీ యాప్,సెల్ఫ్ రిస్క్ అసెస్మెంట్ వినియోగంపై వివరించారు. హెచ్ఐవీ వంటి వ్యాధులను నివారించడంలో అవగాహన ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. ఏవైనా అనారోగ్య లక్షణాలు కనిపిస్తే వెంటనే సమీప ప్రభుత్వ ఆసుపత్రిని సంప్రదించి,వైద్యుల సూచించిన మందులను క్రమం తప్పకుండా వాడితే అనేక వ్యాధులను నివారించవచ్చని తెలిపారు.

అనంతరం శిబిరంలో హెచ్ఐవీ,హెపటైటిస్,మధుమేహం(షుగర్)పరీక్షలు నిర్వహించడంతో పాటు ఇతర సాధారణ వ్యాధులకు కూడా ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎంలు విజయ,కృష్ణవేణి,జీఎన్ఎంలు విజయ లక్ష్మి,రాద ,పద్మ,రాణి,సరిత,రెహమత్,భవా ని,జ్యోతి,ఇందిర తదితరులు పాల్గొన్నారు.

## ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియను పరిశీలించిన జిల్లా కలెక్టర్ మను చౌదరి

### తిమ్మాపూర్, ఎదులాబాద్ గ్రామాల్లో ఇంటింటి ఎన్యూమరేషన్ పత్రాల పంపిణీపై ఆరా



ఘట్కేసర్ జూన్ 25 ప్రభాత సూర్యుడుఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో భాగంగా గురువారం ప్రారంభమైన ఇంటింటి ఎన్యూమరేషన్ పత్రాల పంపిణీ కార్యక్రమాన్ని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మను చౌదరి తిమ్మాపూర్, ఎదులాబాద్ గ్రామాల్లో ప్రత్యేకంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి ఎన్యూమరేషన్ పత్రాలు పంపిణీ చేస్తున్న బూత్ లెవల్ అధికారులతో (బీఎల్ఓలు) కలెక్టర్ మాట్లాడి ప్రక్రియపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రతి బీఎల్ఓకు ఎన్ని ఎన్యూమరేషన్ పత్రాలు అందజేశారని, ఒక్కో కుటుంబానికి ఎన్ని పత్రాలు ఇస్తున్నారని, అలాగే ఎన్యూమరేషన్ యాప్ ద్వారా వివరాలను ఎలా అప్లోడ్ చేస్తున్నారనే అంశాలపై ఆరా తీశారు. దీనికి స్పందించిన బీఎల్ఓలు ప్రతి కుటుంబానికి అవసరాన్ని బట్టి రెండు ఎన్యూమరేషన్ పత్రాలు అందజేస్తున్నామని, స్మార్ట్ఫోన్లోని క్యూఆర్ కోడ్ సదుపాయం ద్వారా వివరాలను నమోదు చేసి యాప్లో అప్లోడ్ చేస్తున్నామని కలెక్టర్కు వివరించారు. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించాలని, ప్రతి అర్హత కలిగిన ఓటరు వివరాలు జాబితాలో సక్రమంగా నమోదు అయ్యేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కలెక్టర్ సూచించారు.

## ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశంలో పాల్గొన్న


### కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సయ్యద్ హుస్సేన్

ములుగు జూన్ 25, ప్రభాత సూర్యుడుములుగు జిల్లా వెంకటాపురం మండలంలోని వి ఆర్ కె పురం గ్రామంలో బద్ది శశిరేఖ భర్త నాగేష్, టేకుల శిరీషా భర్త ,కృష్ణ దంపతుల ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సయ్యద్ హుస్సేన్. పాల్గొని రిబ్బన్ కట్ చేసి ప్రారంబించారు మండల అధ్యక్షుడు మాట్లాడుతూనూతన ఇంటిలో కుటుంబ సభ్యులు సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో జీవించాలని అకాంక్షించారు. అర్హులైన ప్రతి పేద కుటుంబానికి రాజకీయాలకు అతీతంగా ఇందిరమ్మ ఇళ్లు మంజూరు అవుతాయని ప్రతి గ్రామంలో నిరుపేద కుటుంబ లబ్ధిదారులకి ఇందిరమ్మ ఇల్లు అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని అంతేకాక ప్రతి నిరుపేద కుటుంబానికి తెల్ల రేషన్ కార్డు అందించి, సన్న బియ్యం అందించడమే ప్రభుత్వ లక్ష్యమని అలాగే కరెంటు జీరో బిల్లు వస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు మెంబర్ దర రవి, కొప్పుల గంగయ్య, పూసల ఆంజనేయులు, బద్ది కృష్ణార్జునరావ్, పోలిబోయిన భార్గవ్ కాక వెంకటేశ్వర్లు, బొల్లె మల్లికార్జునరావు, నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు



## ప్రత్యేక ఓటరు సవరణ కార్యక్రమంపై విస్తృత అవగాహన

### దేవరయాంజాల్, అంతాయిపల్లి గ్రామాల్లో ఇంటింటి ప్రచారం



శామీర్ పేట్,జూన్ 25 ప్రభాత సూర్యుడు నేటి నుంచి ప్రారంభమైన ప్రత్యేక ఓటరు సవరణ కార్యక్రమం (ఎస్ఐఆర్) నేపథ్యంలో మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కీసర సర్కిల్, శామీర్పేట్ డివిజన్లోని దేవరయాంజాల్, అంతాయిపల్లి గ్రామాల్లో విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బూత్ లెవల్ అధికారులు (బీఎల్ఓలు), బూత్ లెవల్ ఏజెంట్లు (బీఎల్ఏలు) కలిసి ఇంటింటికి వెళ్లి ఓటరు జాబితా సవరణ ప్రక్రియపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ ఓటరు జాబితా సవరణ ప్రక్రియలో ప్రతి ఓటరు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఓటరు వివరాల ధృవీకరణ కోసం బీఎల్ఓలు అందజేసే ఎన్యూమరేషన్ ఫారాలను తప్పనిసరిగా పూర్తి చేసి తిరిగి సమర్పించాలని కోరారు. ఫారాలు సమర్పించకపోతే ఓటరు జాబితాలో పేరు తొలగిపోయే అవకాశం ఉండవచ్చని ప్రజలకు వివరించారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైనదని పేర్కొంటూ, ప్రతి అర్హత కలిగిన ఓటరు తన పేరు ఓటరు జాబితాలో కొనసాగేందుకు అవసరమైన సమాచారాన్ని సకాలంలో అందించాలని సూచించారు. అలాగే కొత్త ఓటర్ల నమోదు, ఓటరు జాబితాలో పేర్ల సవరణ, చిరునామా మార్పులు, ఇతర వివరాల నవీకరణ వంటి అంశాలపై కూడా ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రత్యేక ఓటరు సవరణ కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని, ఓటు హక్కు పరిరక్షణలో బాధ్యతాయుతంగా వ్యవహరించాలని నాయకులు పిలుపునిచ్చారు. ఈ అవగాహన కార్యక్రమంలో జిల్లా ఆర్టీఏ సభ్యులు భీమిడి జైపాల్ రెడ్డి, డివిజన్ కాంగ్రెస్ నాయకులు సింగిరెడ్డి వేణుగోపాల్ రెడ్డి, బాణాల మధుసూధన్ రెడ్డి, నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కత్తి రమేష్, బీఎల్ఏలు హనుమంతు రావు, బీఎల్ఓలు ఎం. ఆనంద్, సి. వీరమణి, డి. సరస్వతి, కరిమునిషా, జి. జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

## నూతన దంపతులను ఆశీర్వదించిన ప్రముఖులు



సింగరేణి జూన్ 25 ప్రభాత సూర్యుడు . సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు కొండబోయిన నాగేశ్వరరావు--ఉమావతి దంపతుల చిన్న కుమారుడు కొండబోయిన రాకేష్కు రవళితో గురువారం పండితాపురంలోని వెంకటేశ్వర ఫంక్షన్ హాల్లో వివాహం ఘనంగా జరిగింది. వివాహ వేడుకకు సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పోతినేని సుదర్శన్రావు,ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి,సీపీఎం ఖమ్మం,భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శులు నున్నా నాగేశ్వరరావు,మచ్చ వెంకటేశ్వర్లు,రాష్ట్ర కమిటీ సభ్యులు పి.సోమయ్య,అన్నారపు కనకయ్య,బండి రమేష్,మాచర్ల భారతి,జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మెరుగు సత్యనారాయణ,బొంతు రాంబాబు,ఎర్ర శ్రీనివాసరావు,ఇల్లందు మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నరసయ్య,ఇల్లందు మున్సిపల్ మాజీ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వర్లు (డీవీ), డీసీసీబీ డైరెక్టర్ మేకల మలిబాబు,మాజీ ఆత్మ కమిటీ చైర్మన్ ముత్యాల సత్యనారాయణ,సీపీఎం మండల కార్యదర్శి కె. నరేంద్ర,బిఆర్ఎస్ నాయకులు హనుమకొండ రమేష్,ఉన్న వీరేందర్,సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు భూక్య రంజిత్ కుమార్,సింగరేణి సర్పంచ్ అధికారులు,ప్రజాప్రతినిధులు,వివిధ రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

## మండలంలోని దరఖాస్తులు నిర్ణీత గడువులో పరిష్కరించాలి: జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్



ఖమ్మం, జూన్ 25 ప్రభాత సూర్యుడుప్రజలకు ప్రభుత్వ సేవలు పారదర్శకంగా, వేగవంతంగా అందేలా అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అన్నారు. గురువారం సాయంత్రం మధిర నియోజకవర్గం ఎర్రుపాలెం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయాన్ని జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించి కార్యాలయ పనితీరు, ప్రజలకు అందుతున్న సేవలను సమగ్రంగా పరిశీలించారు. మండల పరిధిలోని మొలుగుమాడు గ్రామంలో పైలెట్ ప్రాజెక్టు కింద నిర్వహించిన రీసర్వే వివరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. రీసర్వే అనంతరం రైతులకు నూతన పాసుపుస్తకాల జారీ ప్రక్రియపై అధికారులతో చర్చించి అవసరమైన సూచనలు చేశారు. అదేవిధంగా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) కార్యక్రమం పురోగతిపై ఆరా తీశారు. ఓటరు జాబితాల సవరణ ప్రక్రియను వేగవంతంగా, పారదర్శకంగా పూర్తి చేయాలని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఇంటింటి సర్వే, ఫారాల పంపిణీ, వివరాల సేకరణ వంటి కార్యక్రమాల్లో ఎలాంటి లోటుపాట్లు చోటుచేసుకోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యాలయంలో పెండింగ్లో ఉన్న వివిధ దస్త్రాలు, స్లాట్ బుకింగ్, రిజిస్ట్రేషన్లు, సాదా బైనామా దరఖాస్తులు, భూ భారతి దరఖాస్తుల స్థితిగతులను సమీక్షించారు. ప్రజలకు సంబంధించిన భూ సమస్యలు ఎక్కువకాలం పెండింగ్లో ఉండకుండా త్వరితగతిన పరిష్కరించాలని అధికారులకు సూచించారు. కార్యాలయంలోని వివిధ విభాగాలను సంబంధించిన కుల, ఆదాయ, నివాస ధృవీకరణ పత్రాలు, రేషన్ కార్డులు, ఇతర సేవలకు సంబంధించిన దరఖాస్తుల పరిష్కారంపై వివరాలు అడిగి తెలుసుకున్నారు.



# కీర్తి సురేష్ మించి కీర్తిని గడించేలా రష్మిక!



సాధారణంగా గ్లామర్ -బబ్లీ పాత్రలతో అలరిస్తున్న రష్మిక డివైన్ - క్లాసికల్ రోల్‌లో నటిస్తే ఎలా ఉంటుందనే ఆసక్తి అందరిలోనూ వ్యక్తమవుతోంది. బయోపిక్‌లు ఎల్లప్పుడూ ప్రత్యేకమే. లెజెండరీ వ్యక్తుల జీవితాలను వెండితెరపై పునఃసృష్టి చేయడం నటీనటులకు అతిపెద్ద సవాలుతో కూడుకున్న పని. టాలీవుడ్‌లో సావిత్రి జీవిత కథ ఆధారంగా తెరకెక్కిన -మహానటి- చిత్రం ఎలాంటి సంచలనం సృష్టించిందో ? తెలిసిందే. ఆ పాత్రలో ఒదిగిపోయిన కీర్తి సురేష్ రాత్రికి రాత్రే అపారమైన కీర్తిని గడించింది. తాజాగా నేషనల్ క్రష్ రష్మిక మందన్నా కూడా అలాంటి చారిత్రాత్మక పాత్రలో నటించబోతుందనే వార్త ఫిలిం నగర్‌లో హాట్ టాపిక్‌గా మారింది. -మహానటి- చిత్రంలో సావిత్రి పాత్రను పోషించడం అనేది కీర్తి సురేష్ కెరీర్‌లోనే మైలురాయిగా నిలిచిపోయింది. ఆ పాత్రకు న్యాయం చేయడం కోసం కీర్తి పడిన శ్రమ, చూపించిన హావభావాలు ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేశాయి. ఈ సినిమా తెచ్చిపెట్టిన విజయంతో ఆమెకు ఉత్తమ నటిగా జాతీయ అవార్డు వరించడమే కాకుండా సౌత్ ఇండస్ట్రీలో గౌరవం ఒక్కసారిగా పెరిగిపోయింది. ఒక రకంగా చెప్పాలంటే బయోపిక్‌లలో నటించే హీరోయిన్లకు కీర్తి సురేష్ నటన .. వచ్చిన గుర్తింపు ఒక బెంచ్‌మార్క్‌గా మారిపోయాయి. తాజాగా అదే తరహా అరుదైన అవకాశం రష్మిక మందన్నాను వరించబోతోందని సమాచారం. భారతరత్న దక్కించుకున్న తొలి గాయని అయిన ఎమ్.ఎస్. సుబ్బలక్ష్మి జీవిత కథ ఆధారంగా భారీ బయోపిక్ ప్లాన్ జరుగుతోందని అందులో లీడ్ రోల్ కోసం రష్మిక పేరు ప్రముఖంగా పరిశీలనలో ఉందని తెలుస్తోంది. -పుష్ప-, -యానిమల్- వంటి చిత్రాల విజయాలతో పాన్-ఇండియా స్థాయిలో తిరుగులేని క్రేజ్‌ను సొంతం చేసుకుంది రష్మిక. -ఛావా- విజయంతోనూ అమ్మడు అంతే ఫేమస్ అయింది. సాధారణంగా గ్లామర్ -బబ్లీ పాత్రలతో అలరిస్తున్న రష్మిక డివైన్ - క్లాసికల్ రోల్‌లో నటిస్తే ఎలా ఉంటుందనే ఆసక్తి అందరిలోనూ వ్యక్తమవుతోంది. సావిత్రి పాత్రతో పోలిస్తే ఎమ్.ఎస్. సుబ్బలక్ష్మి పాత్రను పండించడం మరింత క్లిష్టం. ఎందుకంటే సుబ్బలక్ష్మి కళాకారిణి మాత్రమే కాదు. భక్తి , ఆధ్యాత్మికతకు ప్రతీకగా నిలిచిన వ్యక్తి. ఆమె శారీరక భాషను, శాస్త్రీయ సంగీత గాన ఉచ్ఛారణను, ముఖ వర్చస్సును వెండితెరపై ప్రదర్శించడం ఏ నటికైనా అగ్నిపరీక్ష లాంటిదే. పాత్ర కోసం ఎంతో సాధన చేయాల్సి ఉంటుంది. ప్రాజెక్ట్ గనుక పట్టాలెక్కితే రష్మిక కెరీర్‌లోనే అత్యంత ప్రతిష్టాత్మకమైన సవాలును ఎదుర్కొబోతోందని చెప్పొచ్చు. రష్మిక ఈ పాత్రలో పరకాయ ప్రవేశం చేసి మెప్పించగలిగితే సాధించే కీర్తి ఖచ్చితంగా కీర్తి సురేష్ సాధించిన దానికంటే ఎక్కువగా ఉంటుందని ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఎందుకంటే ఎమ్.ఎస్. సుబ్బలక్ష్మి కి ఉన్న అంతర్జాతీయ ఖ్యాతి..రష్మికకు ఉన్న వైడ్ పాన్-ఇండియా మార్కెట్ సినిమాను ప్రపంచ స్థాయికి తీసుకెళ్లే అవకాశం ఉంది. కీర్తి సురేష్ సౌత్ లెవెల్లో -మహానటి-గా నిలిస్తే, రష్మిక సుబ్బలక్ష్మి బయోపిక్ సక్సెస్‌తో నేషనల్ అండ్ ఇంటర్నేషనల్ లెవెల్లో నటిగా అత్యున్నత శిఖరాన్ని చేరుకోవడం ఖాయం. ప్రస్తుతానికి ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించిన చర్చలు ప్రాథమిక దశలోనే ఉన్నాయి. రష్మిక మందన్నాను ఇలాంటి ఐకానిక్ పాత్రలో ఊహించుకోవడం అభిమానులకు సరికొత్త జోష్ ఇస్తోంది.


## వరుస ఛాన్సులు.. సాయి తేజ్ హీరోయిన్ ప్లానేదో సరిగ్గా ఉందే..



ప్రస్తుతం ఐశ్వర్య లక్ష్మి పరిస్థితి చూస్తే పారితోషికం పెంచడానికి చాలా ఆప్షన్స్ ఉన్నాయి. మలయాళంలో మంచి గుర్తింపు ఉంది. సినీ ఇండస్ట్రీలో అవకాశాలు పెరిగిన వెంటనే రెమ్యూనరేషన్ ను వెంటనే క్యాష్ చేసుకోవడం అయ్యే విధానం. కానీ మాలీవుడ్ బ్యూటీ ఐశ్వర్య లక్ష్మి మాత్రం భిన్నమైన ప్లాన్ తో ముందుకెళుతున్నట్లు కనిపిస్తోంది. ప్రస్తుతం వరుస సినిమాలతో బిజీగా ఉన్నప్పటికీ, తన కెరీర్ ను మెల్లగా స్ట్రాంగ్ గా మార్చుకోవాలనే ఆలోచనతోనే అడుగులు వేస్తోంది. ఇటీవల ఆమె చేసిన కామెంట్స్ చూస్తే ఆ విషయం క్లియర్ గా అర్థమవుతోంది. హిట్లు వస్తున్నాయని, అవకాశాలు పెరుగుతున్నాయని వెంటనే పారితోషికం డిమాండ్ చేయడం లేదని ఆమె చెప్పింది. ప్రేక్షకులను థియేటర్లకు రప్పించే మార్కెట్ వాల్యూ వచ్చిన తర్వాతే రెమ్యూనరేషన్ గురించి ఆలోచిస్తానని పేర్కొన్నారు. ఆ ఒక్క మాటే ఆమె కెరీర్ ప్లానింగ్ ఎలా ఉందో చెప్పేస్తోంది.ప్రస్తుతం ఐశ్వర్య లక్ష్మి పరిస్థితి చూస్తే పారితోషికం పెంచడానికి చాలా ఆప్షన్స్ ఉన్నాయి. మలయాళంలో మంచి గుర్తింపు ఉంది. తమిళంలో అవకాశాలు వస్తున్నాయి. తెలుగులోనూ వరుసగా ప్రాజెక్టులు చేస్తోంది. సాయి దుర్గ తేజ్ హీరోగా తెరకెక్కుతున్న సంబరాల ఏటి గట్టు వంటి పాన్ ఇండియా సినిమాలో హీరోయిన్ గా నటిస్తోంది. అయినప్పటికీ ఆమె ఫోకస్ డబ్బు మీద కాకుండా మార్కెట్ బిల్డ్ మీద ఉన్నట్లు కనిపిస్తోంది. సాధారణంగా ఒక నటికి క్రేజ్ పెరిగినప్పుడు నిర్మాతలు కూడా నెక్స్ట్ సినిమాల విషయంలో లెక్కలు మార్చుకుంటారు. కానీ ఐశ్వర్య లక్ష్మి మాత్రం ముందుగా ప్రేక్షకుల్లో మంచి గుర్తింపు సంపాదించుకోవాలని చూస్తోంది. తాను నటించిన సినిమా విడుదలైతే ప్రేక్షకులు ప్రత్యేకంగా తన కోసం కూడా థియేటర్ కు వచ్చే రేంజ్ ఏర్పడాలని భావిస్తున్నట్లు ఆమె మాటల్లో తెలుస్తోంది.

## బన్నీ 'రాకా' పై ఇంట్రెస్టింగ్ గాసిప్ ?

'ఐకాన్ స్టార్ అల్లు అర్జున్, స్టార్ డైరెక్టర్ అట్లీ' సినిమా 'రాకా' అప్ డేట్ కోసం బన్నీ ఫ్యాన్స్ ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఐతే, కన్నడ గోల్డెన్ స్టార్ గణేష్ ఓ కీలక పాత్రలో నటిస్తున్నాడని తెలుస్తోంది. రీసెంట్ గానే మలయాళ బ్యూటీ ఫెమినా జార్జ్ కూడా 'రాకా' యూనిట్ లో చేరింది. వచ్చే షెడ్యూల్ లో ఈ మూవీ టీమ్ లోకి మరో హీరోయిన్ కూడా వచ్చి చేరనుంది. మొత్తానికి ఈ సినిమాలో ఇంట్రెస్టింగ్ క్యాస్టింగ్ కనిపించబోతోంది. అన్నట్టు సినిమాలో మంచి ఎమోషన్స్ ఉన్నాయని.. పైగా పాత్రలు కూడా ఎక్కువ ఉన్నాయని.. త్వరలోనే మరో యంగ్ హీరోయిన్ కూడా ఓ ఎమోషనల్ పాత్రలో నటించబోతుందని తెలుస్తోంది.బన్నీ ఈ సినిమా షూటింగ్ లో బిజీగా ఉన్నాడు. కాగా భారీ స్థాయిలో, భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతున్న ఈ సినిమాలో యాక్షన్ అద్భుతంగా ఉంటుందట. ఈ మూవీలో దీపికా పడుకోణె హీరోయిన్ గా నటిస్తోన్న సంగతి తెలిసిందే. అన్నట్టు ఈ సినిమాలో దీపికా పడుకోణెతో పాటు మృణాల్ ఠాకూర్ కూడా హీరోయిన్ గా నటిస్తోంది.





## బాలయ్య-కొరటాల మూవీ బడ్జెట్‌పై సెన్సేషనల్ బజ్..!



గాడ్ ఆఫ్ మాసెస్ నందమూరి బాలకృష్ణ, స్టార్ డైరెక్టర్ కొరటాల శివ కాంబినేషన్‌లో ఒక భారీ ప్రాజెక్ట్ పట్టాలెక్కనుంది. 'బీదీఖ12'గా ఈ క్రేజీ కాంబినేషన్ చిత్రానికి సంబంధించిన అధికారిక లాంచ్ జూన్ 25న గ్రాండ్‌గా జరగనుంది. ఈ ప్రాజెక్ట్ కోసం మేకర్స్ ఏకంగా రూ. 150 కోట్ల నుండి రూ. 200 కోట్ల భారీ బడ్జెట్‌ను కేటాయించనున్నట్లు సినీ సర్కిల్స్ టాక్. బాలయ్య మాస్ ఇమేజ్‌కు ఈ భారీ బడ్జెట్ తోడవడంతో ఈ మూవీపై అంచనాలు ఒక్కసారిగా పెరిగిపోయాయి. ఇక ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ ఈ ఏడాది ఆగస్టు నెల నుండి ప్రారంభం కానుంది. భారీ అంచనాలతో రూపొందనున్న ఈ యాక్షన్ ఎంటర్‌టైనర్‌ను 2027 వేసవి కానుకగా ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేయడానికి చిత్ర బృందం ప్లాన్ చేస్తోంది. మరి బాలయ్య మాస్ పవర్, కొరటాల మార్క్ టేకింగ్ ఈ సినిమాను ఏ లెవెల్‌లో నిలబెడతాయో చూడాలి.

## అప్పట్లో ఘర్షణ.. ఇప్పుడు మళ్లీ.. ఫ్యాన్స్ కు రావిపూడి స్పెషల్ ట్రీట్?



ముఖ్యంగా దర్శకుడు అనిల్ రావిపూడి తెరకెక్కిస్తున్న కొత్త చిత్రంలో వెంకీ స్టైలిష్ అవతార్ లో సందడి చేయనున్నారని టాక్ వినిపిస్తోంది. విక్టరీ వెంకటేష్ అంటే ఫ్యామిలీ ఎంటర్టైనర్లు, ఎంటర్టైన్మెంట్, ఎమోషన్స్ కు పెట్టింది పేరు. అయితే ఆయన కెరీర్ ను పరిశీలిస్తే కేవలం ఫ్యామిలీ హీరోగానే కాకుండా, తనదైన స్టైల్ తో ప్రేక్షకులను ఆకట్టుకున్న సందర్భాలు కూడా చాలానే ఉన్నాయి. ఇప్పుడు మరోసారి వెంకటేష్ కొత్త లుక్ లో కనిపించబోతున్నారనే వార్త అభిమానుల్లో ఆసక్తిని పెంచుతోంది. ముఖ్యంగా దర్శకుడు అనిల్ రావిపూడి తెరకెక్కిస్తున్న కొత్త చిత్రంలో వెంకీ స్టైలిష్ అవతార్ లో సందడి చేయనున్నారని టాక్ వినిపిస్తోంది. వెంకటేష్ గతంలో పలు చిత్రాల్లో ట్రెండీ లుక్స్ తో ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. ఘర్షణ సినిమాలో డీసీపీ రామచంద్ర పాత్రలో ఆయన కనిపించిన తీరు ఇప్పటికీ అభిమానులకు గుర్తుండే ఉంటుంది. క్లాసీ హెయిర్ స్టైల్, స్టైలిష్ గాగుల్స్, ఫిట్ లుక్ తో వెంకీ ఆ సినిమాలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. అలాగే వాసు చిత్రంలో యూత్ ను ఆకట్టుకునే మోడ్రన్ స్టైల్ లో కనిపించి మంచి మార్కులు సాధించారు. షాడో సినిమా ఆశించిన విజయాన్ని అందుకోకపోయినా, అందులో వెంకటేష్ లుక్ మాత్రం అందరినీ ఆకట్టుకుంది. విభిన్న హెయిర్ స్టైల్స్, స్టైలిష్ కాస్ట్యూమ్స్‌తో ఆయన కొత్తగా కనిపించారు. బాబు బంగారంలో కూడా యంగ్ అండ్ ఎనర్జిటిక్ లుక్‌తో అభిమానులను ఆకట్టుకున్నారు. ఇక గురు, సైంధవ్ చిత్రాల్లో సాల్ట్ అండ్ పెప్పర్ స్టైల్ తో క్లాస్ లుక్‌లో మెరిశారు. రానా నాయుడు వెబ్ సిరీస్ లో అయితే ఇప్పటివరకు చూడని బోల్డ్ పాత్రలో కనిపించి అందరినీ ఆశ్చర్యపరిచారు. ఇప్పుడు అనిల్ రావిపూడి దర్శకత్వంలో రూపొందుతున్న సినిమాలో వెంకటేష్ మరోసారి సరికొత్త గెటప్ లో కనిపించబోతున్నారని సమాచారం. ఇటీవలే ఆ సినిమా షూటింగ్ ప్రారంభమైంది. వెంకటేష్, నందమూరి కళ్యాణ్ రామ్ కీలక పాత్రల్లో నటిస్తున్న ఆ చిత్రంపై ఇప్పటికే మంచి అంచనాలు ఏర్పడ్డాయి. సినిమా సెకండాఫ్ లో వచ్చే ఫ్లాష్ బ్యాక్ ఎపిసోడ్ కోసం వెంకటేష్ లుక్ ను ప్రత్యేకంగా డిజైన్ చేస్తున్నట్లు తెలుస్తోంది. వెంకీని మరింత స్టైలిష్ గా చూపించేందుకు మూవీ టీమ్ ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. దీంతో చాలా కాలం తర్వాత మరో కొత్త యాంగిల్ లో చూసే అవకాశం అభిమానులకు దక్కనుంది. అయితే రావిపూడి సినిమాలు అంటే వినోదానికి పెద్దపీట వేస్తాయనే విషయం తెలిసిందే. ఆ చిత్రంలో కూడా కామెడీ ప్రధాన ఆకర్షణగా ఉండబోతుందని, అదే సమయంలో స్ట్రాంగ్ ఫ్యామిలీ ఎమోషన్స్ కథకు బలం చేకూరుస్తాయని టాక్ వినిపిస్తోంది. వెంకటేష్ కు బాగా సెట్ అయ్యే ఫ్యామిలీ ఎంటర్టైనర్ ఫార్మాట్ లోనే ఆ కథను రూపొందిస్తున్నట్లు సమాచారం. ఏదేమైనా ఇప్పుడు కొంత గ్యాప్ తర్వాత వెంకటేష్ మరోసారి స్టైలిష్ అవతారంలో కనిపించనున్నారనే వార్త అభిమానుల్లో ఉత్సాహాన్ని పెంచుతోంది. కామెడీ, ఎమోషన్స్ తో పాటు కొత్త లుక్ లో వెంకీ కనిపిస్తే.. రావిపూడి మరోసారి ప్రేక్షకులకు కంప్లీట్ ఎంటర్టైన్మెంట్ ట్రీట్ ఇవ్వడం ఖాయమనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. మరేం జరుగుతుందో అంతా వేచి చూడాలి.

## బుచ్చి బాబు హీరో... జాన్వీ కపూర్ స్టార్?



ప్రస్తుతం టాలీవుడ్‌లో దర్శకుడు బుచ్చిబాబు సానా..బాలీవుడ్ స్టార్ బ్యూటీ జాన్వీ కపూర్ల తదుపరి ప్రాజెక్టుల గురించే ఆసక్తికర చర్చ నడుస్తోంది. ప్రస్తుతం టాలీవుడ్‌లో దర్శకుడు బుచ్చిబాబు సానా..బాలీవుడ్ స్టార్ బ్యూటీ జాన్వీ కపూర్ల తదుపరి ప్రాజెక్టుల గురించే ఆసక్తికర చర్చ నడుస్తోంది. గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ హీరోగా రిలీజ్ అయిన -పెద్ది- చిత్రంలో ఇద్దరు కలిసి పని చేయడంతో ఈ కాంబినేషన్ భారీ క్రేజ్ సంపాదించుకుంది. ఈ చిత్రం ముగిసిన నేపథ్యంలో ట్రేడ్ వర్గాలతో పాటు ఇండస్ట్రీ వర్గాల్లో కూడా ఇద్దరి ఫ్యూచర్ లైనప్‌లపై రకరకాల ఊహాగానాలు మొదలయ్యాయి. బుచ్చిబాబు తదుపరి ఏ హీరోతో సినిమా చేయబోతున్నారు? జాన్వీ కపూర్ ఏ టాలీవుడ్ హీరో సరసన తదుపరి ఛాన్స్ అందుకుంటుంది? అనే ప్రశ్నలు ఫిలిం నగర్ సర్కిల్స్‌లో హాట్ టాపిక్‌గా మారాయి. బుచ్చిబాబు సానా విషయానికి వస్తే.. ఆయనది టాలీవుడ్‌లో విలక్షణమైన ప్రయాణం. మొదటి చిత్రం -ఉప్పెన-తోనే వంద కోట్ల క్లబ్ చేరి జాతీయ అవార్డు ను సైతం గెలుచుకున్న బుచ్చి రెండవ చిత్రానికే రామ్ చరణ్ లాంటి గ్లోబల్ స్టార్‌ను డైరెక్ట్ చేసే అరుదైన అవకాశాన్ని దక్కించుకున్నారు. గురువు సుకుమార్ అందించిన స్ఫూర్తితో -పెద్ది- చిత్రాన్ని అత్యంత భారీ స్థాయిలో గ్రామీణ నేపథ్యం ఉన్న స్పోర్ట్స్ డ్రామాగా తెరకెక్కించి మేకింగ్ శైలిని నిరూపించుకున్నారు. ఇంతటి భారీ కాన్వాస్ ఉన్న చిత్రాన్ని హ్యాండిల్ చేసిన తర్వాత బుచ్చిబాబు తదుపరి అడుగు ఏ రేంజ్‌లో ఉండబోతుందనే ఆసక్తి అందరిలోనూ పెరిగింది. బుచ్చిబాబు తదుపరి చిత్రం ఏ హీరోతో ఉండబోతుందనే దానిపై ఇండస్ట్రీలో రకరకాల కాంబినేషన్లు వినిపిస్తున్నాయి. మైత్రీ మూవీ మేకర్స్ - సుకుమార్ రైటింగ్స్ వంటి అగ్ర నిర్మాణ సంస్థలతో అత్యంత సన్నిహిత సంబంధాలు కలిగి ఉండటం వల్ల తదుపరి ప్రాజెక్ట్ కూడా టైర్-1 హీరోతోనే ఉండే అవకాశం ఉందని కొందరు భావిస్తున్నారు. ఎన్టీఆర్ ... అల్లు అర్జున్ లాంటి స్టార్స్‌తో బుచ్చిబాబుకు మంచి సాన్నిహిత్యం ఉండటంతో వారితో ఏమైనా ప్రాజెక్ట్ సెట్ అవుతుందా? లేక కథకు ప్రాధాన్యతనిస్తూ ఒక క్రేజీ యంగ్ హీరోతో కంటెంట్-డ్రివెన్ సినిమాను ప్లాన్ చేస్తారా ? అనేది తెలియాల్సి ఉంది. బుచ్చిబాబు సిద్ధం చేసే కొత్త లైన్‌ను బట్టే ఆ హీరో ఎవరనే సస్పెన్స్‌కు తెరపడనుంది. మరోవైపు అతిలోక సుందరి శ్రీదేవి వారసురాలిగా ఎంట్రీ ఇచ్చిన జాన్వీ కపూర్ తక్కువ సమయంలోనే టాలీవుడ్‌లో మోస్ట్ వాంటెడ్ హీరోయిన్‌గా మారిపోయింది. గ్లామర్ పాత్రలకే పరిమితం కాకుండా నటనకు ప్రాధాన్యమున్న పాత్రలను ఎంచుకుంటూ సౌత్ ఇండస్ట్రీలో తనకంటూ ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకునే ప్రయత్నంలో ఉంది. జూనియర్ ఎన్టీఆర్ సరసన -దేవర- చిత్రంతో తెలుగు తెరకు పరిచయమైన ముద్దుగుమ్మ, ఆ వెంటనే రామ్ చరణ్‌తో -పెద్ది- చిత్రంలో నటించి బ్యాక్-టు-బ్యాక్ టాలీవుడ్ టాప్ లీగ్ స్టార్స్‌తో స్క్రీన్ షేర్ చేసుకునే గోల్డెన్ ఛాన్స్ దక్కించుకుంది. దీంతో జాన్వీ బాలీవుడ్ నటిగానే కాకుండా ప్రాపర్ పాన్-ఇండియా స్టార్‌గా ఎదిగింది.

Published & Owned by CHERUKU UPENDAR on behalf of HAMSA PUBLICATIONS,Pulblished at H.No:7-83/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR,ABDULLAPURMET MANDAL,Hayanthnagar,Rangareddy District/Hyderabad City,Telangana-Pin:501505. Printed by RATNA GRAPHICS at H.No.2-3-703/7,Tirumala Nagar Colony,Police Lane,Amberpet, Hyderabad-500 013 Telangana.Editor: CHERUKU UPENDAR E-mail:prabhathasuryudueditor@gmail.com PRGI Reg No:TGTEL/25/A0555